

# జాలి గుండె

కె. రామలక్ష్మి

కృష్ణమూర్తి టీ కప్పు నోటి కందించుకుని షాకిచ్చినట్టు తీసేస్తూ "పంచదార మరిచిపోయావోయ్" అన్నాడు.

"ఓ నెల్లాళ్ళు పంచదార మానేద్దాం అనుకున్నాం. మరిచిపోయావా? ఆ నెల రేషను డబ్బు బాలమందిర్‌కి పంపిద్దామన్నానుగా?" పార్వతి గొంతు చాలా తాపీగా ఉండడమే కాదు. చాలాదృఢంగా కూడా వుంది!

పార్వతి అక్కడి నుంచి వెళ్ళిపోయాక మూలిగాడు కృష్ణమూర్తి. దీని తరవాత యింకేం ఆలోచిస్తుందో... తన యిన్నేళ్ళ జీవితంలో అలాంటి దురదృష్ట వంతులని గురించీ, అనాథలని గురించీ ఆలోచించినది తక్కువే. తన త్రైమంతా ప్రపంచంలో పోటీపడి నిలదొక్కుకుందుకే సరిపోవటం లేదు. ఇంక వీళ్ళని గురించి ఎక్కడ ఆలోచిస్తాను? అనుకున్నాడు. పాపం, పార్వతి అలా కాదు. ఏ ముహూర్తాన వెళ్ళి చూసిందో బాలమందిర్. అక్కడ వున్న దిక్కులేని పసివాళ్ళని చూసి ఆమె హృదయం ద్రవించి పోయింది. ఇలాంటి వాళ్ళుండడానికి ప్రపంచంలో తనలాంటి వాళ్ళెందరెందరో బాధ్యులని ఆమె మనస్సు ఘోషించింది. ఇంటికి వచ్చి—అన్నం తినలేకపోయింది. తన ముగ్గురు పిల్లలనీ తీక్షణంగా పరీక్షగా చూసుకుంది. వీళ్ళు అన్నీ వున్నవాళ్ళు. ఎంత అదృష్టవంతులు! అనుకుంది. ఆరోజునుంచీ పిల్లలకి జాలీ, దయ సహృదయత, అందరీ పట్లా వుండేలా పెంచాలని నిర్ణయించుకుంది. అంతేకాదు. ఇంట్లో చిన్న చిన్న యిబ్బందులు, త్యాగాలు, చేసైనా సరే 'వుడుతాభక్తి' దీన జనావళికి సహాయం చేయాలనుకుంది. ఆ రాత్రే గోముగా కృష్ణమూర్తివుంగరాల జుట్టు నిమురుతూ చెప్పింది "ఒచ్చే నెల్లాళ్ళు మనం పంచదార మానేద్దాం!"

"ఎందుకు? టీ చేదుగా బాగుండదు పార్వతీ," దీనంగా అన్నాడు కృష్ణమూర్తి - తన తలలో చిక్కులు చేస్తున్న ఆమె వేళ్లని తన చేతిలోకి తీసుకుంటూ.

"చూడు కృష్ణా, ప్రపంచంలో ఎన్నో అవసర వస్తువులు లేకుండా లక్షల మంది కాలక్షేపం చేస్తున్నారు. మనం ఒక్క నెల రోజులపాటు పంచదార మానలేమా? ... బాలమందిర్‌లో పిల్లలని చూస్తే నువ్విలా అనవు. మనకి టీ చేదు. వాళ్లకి జీవితమే చేదు" అంది బాధగా.

సుఖంగా బ్రతుకుతూ నేరం చేస్తున్నామన్న బాధ దొలిచేస్తున్న పార్వతిని చూసి జాలేసింది కృష్ణమూర్తికి. అమాంతం భార్యని కౌగిట బిగిస్తూ రోజా మొగ్గల్లా వున్న ఆమె పెదవులు ముద్దుపెట్టుకున్నాడు.

"నీ పెదవుల తీపి ముందు పంచదారెందుకులే పార్వతీ, ఒచ్చేనెలేగా. అలాగే మానేద్దాం" అన్నాడు. పార్వతి కళ్ళు సంతోషంతో మెరిశాయి. అనాథల బాధలు తల్చుకుని నీటిపొర కప్పివున్న కళ్లు మిలమిల మెరిశాయి భర్త ఛాతి మీద తలాన్చుకుని 'నాకు తెలుసు నువ్వు నామాట కాదనవని' అంది ప్రేమగా.


కాని ఈ పూట టీ నోటికొచ్చేదాకా తెలియలేదు కృష్ణమూర్తికి- అప్పుడే ఆ నెల గడిచిపోయిందని. ఉసూరు మంది ప్రాణం. టీ తాగబుద్ధి కాలేదు. పార్వతి

లోపలికి వెళ్లనిచ్చి గులాబి చెట్టు మొదట్లో పోశాడు టీ!

"నా అంతట నేనేం చేయక్కర లేకుండానే పార్వతి నన్ను విజ్ఞానవంతు డిలా రూపొందించేస్తూంది. ఇన్నాళ్లూ జీవి తంలో ఆలోచించని ఆనాధలంతా యీ పూట టీ తో జ్ఞాపకం వచ్చారా లేదా!" అనుకున్నాడు. 'ఆఫీసుకి వెళ్లగానే ముందు ఓ కప్పు టీ తెప్పించుకోవాలి' అనుకున్నాడు. అది మోసం చెయ్యడం కాదు కదా? అన్న వూహ తలెత్తింది.

'అసలు పార్వతి ధర్మమా అని యీ ప్రపంచంలో ప్రతిక్షణం ఎన్ని వేల మంది 'అక్కరలేని పిల్లలు' పుడుతు న్నారో, ఎన్నివేల మంది అన్నమో రామచంద్రా అంటూ చస్తున్నారో, ఎంత మంది సగం చచ్చిన నల్లుల్లా బ్రతి కేస్తున్నారో - తెలుసు కుంటూనే వున్నాడు. ఇలాంటి ఎన్నో విషయా లెప్పుడూ పార్వతి నాలుకచివర వుంటాయి! బాధగా నిట్టూర్చాడు కృష్ణ మూర్తి. వీటితో పాటు యింటి పనుల్లో కూడా నేర్పుంటే ఎంత బాగుండును! అనుకున్నాడు. ఆ కుంటి కొంగల మీద జాలిలో వందో వంతు నామీద కూడా వుంటే ఎంత బాగుండును ఈ పార్వతికి! -అనుకుని కుర్చీలో జేరబడి కళ్లు మూసు కున్నాడు.

మనుషుల్ని చూసి వాళ్ల తత్వాలు చదివేయకలను అనుకునే కృష్ణమూర్తికి యీ పార్వతినెలా చేపట్టానా అన్న డౌటు అప్పుడప్పుడు రాక పోలేదు...పరిశుభ్ర తకి మారుపేరుగా తోచింది-తొలిసారి బూజులకర్రతో చూసినప్పుడు - ఆరోజే అక్కడే హృదయం పారేసుకున్నాడు. కాని మారువేషంలో వున్న 'ఏక వ్యక్తి సేవా సంస్థ' అని ఎలా తెలుస్తుంది!! అంత సరదాతనం కింద అలా ద్రవించి పోయే గుండె దాక్కుని వుందని ఎలా వూహించ కలడు? చలించని మానసిక




దారుఢ్యం కూడా వుంటుందని ఎలా కల కనగలడు. అసంభవం.

ప్రపంచంలో ఎక్కడ బీభత్సం జరిగినా-పార్వతి దానికి ప్రతి ధ్వనిలా మారు పల్కుతుంది! తక్షణం-రెడ్‌క్రాస్ వాళ్లవి, మహిళా సంఘం వాళ్లవి... యింకా ఎవరెవరివో డబ్బాలు యింట్లో ప్రత్యక్షం అయిపోతాయి. 'ఒరే నాని, యీవాళ నువ్వు పదిపైనలేనా వెయ్యాలి.' అంటుంది. 'ఒరే బాబీ, నువ్వూను' అంటుంది ముద్దుగా. కృష్ణమూర్తి సంగతి సరేసరి. 'ఒక్కపూట ఒకే ఒక పూట.' అంటుంది.ఆ మాత్రం చెయ్యలేని వాడా నా భర్త అన్న ధీమా ధ్వని స్తుందా కంఠంలో...అలా వెయ్యకపోతే తనను ఏమనుకుంటుందో ఈ పార్వతి.. అయినా యింత చిన్న విషయానికి ఆమె నెందుకు కష్టపెట్టడం అనిపిస్తుంది... వేసేస్తాడు.

'నువ్వెంత మంచివాడివి కృష్ణా' అంటూ పిల్లలు చూస్తున్నారన్న యిదేనా లేకుండా మునివేళ్ల నిలబడి అమాంతం ముద్దు పెట్టేసుకుంటుంది. కాని పార్వతి ముఖంలోని ఆత్రుత చూస్తే పిల్లికి బిచ్చం పెట్టని వాడు కూడా వేయకుండా వూరుకోలేడు అని నవ్వేస్తాడు కృష్ణ మూర్తి.

ఇలాంటి చిన్న చిన్న దానధర్మాలు తాపత్రయాలు-చూసీ చూడనట్టు వూరు కోవడం అలవాటు చేసుకున్నాడు కృష్ణ మూర్తి. సంసారం సుఖంగా సాగి పోతూంటే యివన్నీ కష్టం అనిపించ లేదెప్పుడూ. చివరికి యింట్లో తలదాచు కోవడం ప్రారంభించిన వూరకుక్కని కూడా సహించడం నేర్చుకున్నాడు. ఈ పార్వతి మనుషులనే కాదు-ఏ జంతువేనా దీనంగా చూస్తే, బాధగా కనిపిస్తే... చేరతీయకుండా వుండలేదు అను కున్నాడు...

ఆ రోజు యింటికి వచ్చేసరికి పిల్లలు వీధి మెట్టు మీద కూర్చుని వున్నారు. నూకాలు బేబీని ఎత్తుకుని పాలకి వెళ్ళి వస్తూ కృష్ణమూర్తిని చూసి వేగం హెచ్చించింది.

'అమ్మగారేరి నూకాలూ?' అడిగాడు.

ముసి ముసి నవ్వులు నవ్వింది నూకాలు. బొడ్డు నించి తాళంచెవితో పాటు ఓ కాగితం కూడా తీసి కృష్ణ మూర్తి చేతికిచ్చింది. "డియర్, బ్లూక్రాస్‌కి వెడుతున్నాను. కుక్కని పెంచు కుందు కెవర్నేనా చూడమని. త్వరగా వచ్చేస్తా." నని రాసింది.

పిల్లలూ కృష్ణమూర్తీ సాయంత్రం పూట వులుకూ పలుకూ లేకుండా కూర్చు

న్నారు. నానిగాడు మోకాలు మీద దెబ్బ తగుల్చుకున్నాడు. బాబిగాడికి మూడ్ బాగాలేదు-అన్నీ విసిరేసే మూడ్ లోవుండి నూకాలు కసిరితే కోపంవచ్చి ఓ మూల కూర్చున్నాడు బేబీ నూకాలు వెనకాలే తిరుగుతూ ఉట్టినే ముక్కుతోంది

కృష్ణ మూర్తి నిట్టూర్చాడు. 'పిల్లల్ని యిలా వదిలేసి వూరుకుక్కని ఎవరేనా పెంచుకుందుకు చూస్తారేమో అడగాలని వెళ్లింది! మైగాడ్! ఈ పార్వతికి ఎలా చెప్పడం? పిల్లలకి లేని సంఘసేవా?' పార్వతి మీద కొంచెం కోపం వచ్చింది. కృష్ణమూర్తికి బట్టలు మార్చుకుని వాలు కుర్చీలో పడుకున్నాడు. సూర్యుడు అస్తమిస్తున్నాడు. నీరెండలో ప్రకృతి వింత వెల్గులో నిండింది.

అప్పుడొచ్చింది పార్వతి—అతి ఉత్సాహంగావుంది. ముఖం సంతోషంతో వెల్గి పోతోంది. "ఆ కుక్కని ఒకాయిన తీసుకుంటా నన్నారు కృష్ణా... పాపం. పిచ్చి ముండకదూ.' అంది కృష్ణమూర్తి తలవైపు వచ్చి క్రాపు సవరిస్తూ.

క్రాపుసవరిస్తున్న చేతిని పట్టుకుని పార్వతిని తన ముందుకి లాక్కున్నాడు "చూడు పార్వతీ, నీతో ఓ మాట చెప్పనా?'' అడిగాడు కృష్ణమూర్తి నోట్లో మాటలు నోట్లోనే వుండి పోయాయి. బిలబిల్లాడుతూ—పిల్లలు తల్లిని చుట్టు ముట్టారు. 'వీళ్ళేనా అలా దిగాలుపడి కూర్చున్నది! అనిపించింది తల్లిని ఆరాధనతో చూస్తున్న వాళ్ల ముఖాలు చూస్తుంటే—కృష్ణమూర్తికి.

'ఏదీ కుక్క?' తల్లి చెయ్యి పట్టుకు లాగుతూ అడిగాడు నానిగాడు. వాడి కాలి మీది దెబ్బ ఆక్షణంలో నెప్పి పెట్టిందో లేదో మరి.

"మన ముష్టిని ఎందుకిచ్చేశావు? తెచ్చేయి," కళ్ల నీళ్ళు తరవాయిగా డిమాండ్ చేస్తున్నాడు బాబి గాడు. కుక్కవున్న నాల్గు పూటలూ పాలోసిన గిన్నె పట్టుకుని అన్నలిద్దరి మధ్య నుంచీ తల్లిని చేరాలని చూస్తూంది బేబీ.

అందరినీ ఒక్కసారే తన చేతుల్లోకి తీసుకుంది పార్వతి.

"నేచేప్పేది వినండి. ముష్టికి మంచి యిల్లు చూశాను. అక్కడ వాళ్ళు బాగా చూసు కుంటారు...అంచేత..."పార్వతి మాట పూర్తికాలేదు 'మరి మనకి?' నానిగాడు అడిగాడు.

"మళ్లీ యింకోటి రాదేవిటి నానీ"... అంటున్న పార్వతి కళ్లు ఎర్రగా చెక్కుకుపోయి రక్తం చిమ్మిన నానిగాడి మోకాలు మీద పడింది. 'పడ్డావా? అంటూ వాడి తలనిమిరింది. ఆమె కళ్లు దయతో బాధతో నిండి పోయాయి.

'రండి ముందాకాలుకి ముందువేద్దాం' అంటూ అందరినీ హాల్లోంచి తరిలించింది.

'చెప్పాలను కున్న వన్నీ యిలాగే... నాలో వుండి పోతున్నాయి. జీర్ణమంగే సుభాషితమ్!' అనుకున్నాడు చాలా వేదాంత ధోరణిలో.

వంటింటి అవతల వరండా లోంచి నానిగాడి గొంతు-దాన్ని క్రాస్ చేస్తూ బాబిగాడి మాటలు వాడి మధ్య బేబీ ముద్దు మాటలు-వీటన్నిటికీ లయలా పార్వతి వినసొంపైన గొంతు. జేమ్సు జాయిన్ నవలలా తోచాయి కృష్ణమూర్తికి.

"ఈ అనవసరపు తాపత్రయాలకి స్వస్తి చెప్పి నన్నూ నా పిల్లలనీ చూసుకో" అని చెప్పాలనుకున్నాడు.

"లోకాన్ని నువ్వొక్కతెవీ మరమ్మత్తు చెయ్యలేవు. కొంచెం విశ్రాంతిగా వుండడం అలవాటు చేసుకో" అని చెప్పాలను కున్నాడు.

కాని ఆ క్షణం కాస్తా దాటిపోయింది. ఈ క్షణంలో చుట్టూ పిల్లలని పెట్టుకుని దెబ్బ ఎలా కడగాలి? టించరెలా మందు తుంది? అబ్బాయిలు దెబ్బలు తగిలితా ఎందుకు నవ్వుతూ వుండాలి...అన్నీ పాఠం బోధించినట్టు చెప్తుంది పార్వతి.

కుర్చీలో పడుకుని దూరంనుంచి విన్పిస్తున్న పార్వతి మాటలతీరు—హాయిగా అనిపించింది కృష్ణ మూర్తికి. ఈ పార్వతి యింట్లో లేని క్షణం ఎంత బాధ అనిపించిందో కదా! అనుకున్నాడు...

ఇంట్లో ప్రశాంతంగా వుంది. బయట చీకట్లు అలుము కున్నాయి. పిల్లలు నిద్ర కొరిగారు తలుపులు మూసి పడకగది చేరింది పార్వతి.

ఇంకా వాలు కుర్చీలోనే పడుకుని కిటికీలోంచి కన్పిస్తున్న నక్షత్రాలని లెక్కవేయాలని చూస్తూన్నాడు కృష్ణ మూర్తి.

"ఏం యింకా పడుకోలేదూ? రేపు సెలవా?" భర్త కుర్చీ దగ్గరగా కూర్చుంటూ అడిగింది పార్వతి.

"లేదు పార్వతీ ఆలోచిస్తున్నాను." అన్నాడు కృష్ణమూర్తి.

"ఏమిటి ఆలోచన? నన్ను గురించా? దగ్గరగా కూర్చుంటూ అడిగింది పార్వతి.


పార్వతి భుజంమీద ఓ చెయ్యివేసి ఆమె ముఖంలోకి చూస్తూ "చెప్పనా?'' అడిగాడు.

ఇంతట్లో.....అతిజాలిగా...మ్యావ్ మంటూ అరుపు వినిపించింది పెరట్లోంచి.

మరుక్షణంలో పార్వతి లేచి వంటిల్లు దాటి పెరటి తలుపు తీసింది.

కృష్ణ మూర్తి వెనకాతలే వున్నాడు "ఏమైంది పార్వతీ" అంటూ.

కాని ఆత్రుతతో అల్లల్లాడి పోతూన్న పార్వతి ముఖంచూసి తక్షణం లోపలికి వచ్చేసి తలుపులు బిగించుకుని వుండవలసిందే. కాని ఏంలాభం? ప్రశ్న అడిగేశాడు—



"పిచ్చిముండ. చెట్టుపై కొమ్మలు ఎక్కేసింది. దిగలేక ఏడుస్తూంది కృష్ణా" అంది బాధగా. పెరట్లో ఉన్న వేపచెట్టు కొమ్మల్లోకి చూశాడు కృష్ణమూర్తి. కొమ్మల మధ్య కూర్చుని అరుస్తుందో చిన్నపిల్లిపిల్లి. "ఎలా ఎక్కిందో అలాగే దిగిరాలే దంటావా పార్వతీ" అన్నాడు అనుమానంగా.

"పాపం భయంతో ఒణికి పోతూంది కదూ, దిగిరాలేదు కృష్ణా. ఓ నిమిషం వుండు. నిచ్చెనతెచ్చి ఎక్కి దింపేస్తాను. అంటూ స్టోర్ రూము కేసి నడవ బోయింది పార్వతి. చేయిపట్టి ఆపి 'నే దింపుతాలే' అనడమూ, చెట్టు ఎక్కడం ప్రారంభించడం—ఒకేసారి జరిగాయి. ఎలాగో కష్టపడి పై కెగబాకి, పిల్లిపిల్లని బ్రతిమాలి అందుకున్నాడు. మెల్లిగా దాన్ని పార్వతి చేతుల్లో పడేలా ఒదిలాడు.

చెట్టు దిగుతూన్నప్పుడే జరిగింది- అసలుప్రమాదం కాలు పట్టుతప్పి నేల మీద ధభీలున పడ్డాడు. లేచేలోపలే పరుగెత్తి అతని మీదికి వంగింది పార్వతి "కృష్ణా,ఏందెబ్బ తగల్లేదు కద?"అంటూ ఆత్రంగా అడిగింది.

ఆమె కళ్లు భయంతో అతనికేసి చూస్తుంటే—కృష్ణమూర్తికి మత్తెక్కినట్టయింది. జాలిగుండె కల పార్వతి కుంటి బాతులమీద, కుక్కపిల్లమీద పిల్లి పిల్లలమీద, అనాథలమీద కనపరిచే కురిపించే జాలిప్రేమ ఒక్కసారి జ్ఞాపకం వచ్చి మూలిగాడు. చిన్నదెబ్బలకు మినహా ఏంప్రమాదం జరగలేదని పార్వతికి చెప్పదలచుకోలేదు. ఇప్పుడున్నంత హాయిగా నా కెప్పుడూ లేదని ఆకళ్ళు ఆభయం ఆజాలి. ఆప్రేమ చూశాక- ఎందుకు చెప్పడం అనిపించింది కృష్ణమూర్తికి.

మృదువుగా కృష్ణమూర్తి తల ఎత్తి తన ఒళ్ళో పెట్టుకుని తల నిమురుతూ ఓ క్షణం కదలకుండా పడుకో కృష్ణ అంది ప్రేమతో.

"ఓ క్షణం ఏం కర్మ పార్వతీ, జీవితాంతం నేనిలా పడుకోకలను" అంటూ ఆమె చేయి తనచేతిలోకి తీసుకున్నాడు.

అయినా, ఆ పిల్లి పిల్ల దిగలేదని పార్వతి అనడం దాన్ని దింపడానికి తను చెట్టు ఎక్కడం ఏమిటి? అని తోచలేదు కృష్ణమూర్తికి. కొంపతీసి నాకు జాలి గుండె వస్తూంది కాబోలు అనుకొని పార్వతి ఒడిలో కళ్ళు మూసుకు పడుకున్నాడు.

చంద్రోదయంలో, వేపచెట్టు చల్లని గాలితోపాటు హాయిగా వుంది కృష్ణమూర్తి మనస్సు.

